నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శనివారం 5 ఏప్రిల్ 2025
SATURDAY, APRIL 5, 2025

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

సుద్దపల్లిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

డిచ్‌పల్లి/ఇందల్వాయి, ఏప్రిల్ 4 : డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుద్దపల్లి పాఠశాల పీఎంశ్రీ పాఠశాలకు ఎన్నిక కావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసిస్టెంట్ కమిషనర్ యోహాన్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో అనంతరావు, ఎంఈవో శ్రీధర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ – డిచ్‌పల్లి ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల ఉచిత శిక్షణ కోసం మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలర్ కోర్సు ఈనెల 7 నుంచి, బ్యూటీషియన్ కోర్సు 14 నుంచి ప్రారంభమవుతుందని, శిక్షణ సమయంలో ఉచితంగా హాస్టల్‌వసతి, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. 19–45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువతులు అర్హులని తెలిపారు. అర్హులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలతో సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 08461–295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సిరికొండ, ఏప్రిల్ 4 : మండలంలోని ముషీర్‌నగర్, మెట్టు, మర్రితండా, గడ్కోల్, గోప్యాతండా, కొండాపూర్, హుస్సేన్‌నగర్, తాళ్లరామడుగు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గడ్కోల్ గ్రామంలోని కప్పలవాగుపై రూ.2.46 కోట్లతో చెక్‌డ్యాం, రూ.3 కోట్లతో లొంక రోడ్డుపై బ్రిడ్జితోపాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గడ్కోల్ గ్రామంలో రూ.3.10 కోట్లతో డబుల్ రోడ్డు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, మండల అధ్యక్షుడు బాకారం రవి, సొసైటీ చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎప్పుడు?

ధర్పల్లి, ఏప్రిల్ 4 : ధాన్యం కోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా మండలంలోని దుబ్బాక గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని, ఎప్పుడు ఏర్పాటు చేస్తారని బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోతి శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంటను కోసి, ధాన్యం దళారులకు విక్రయించారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేసి, రైతులు లబ్ధి పొందేలా చూడాలని కోరారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలను వెల్లడించిన సీపీ సాయిచైతన్య

వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4 : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మహిళను టార్గెట్ చేసి, ఆమెతో కలిసి కల్లు తాగి, కత్తితో గొంతుపై దాడి చేసి హత్యచేసిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, హత్య కేసు వివరాలను వెల్లడించారు. నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంగ్రా బోర్గాం గ్రామంలో కల్లు బట్టీ పక్కన ఓ ఇంట్లో చారు గొండ చంద్రకళ (55) ఒంటరిగా ఉండేది. కల్లు తాగేందుకు వచ్చిన కామారెడ్డి జిల్లా హరిజనవాడకు చెందిన యువకుడు శంషాబాద్ విజయ్.. చంద్రకళ ఒంటిపై ఉన్న నగలను కాజేసేందుకు ప్లాన్ వేశాడు. ఆమెతో పరిచయం ఏర్పర్చుకొని, గత నెల 23న సదరు యువకుడు కల్లు బట్టిలో కల్లు తీసుకుని చంద్రకళ ఇంట్లో ఆమెతో కలిసి తాగాడు. అనంతరం కత్తిలో ఆమె గొంతుపై దాడిచేశాడు. ఆమె మరణించిన అనంతరం ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు, మాటీలతో పాటు వెండి పట్టగొలుసులు, సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయాడు. పారిపోయేందుకు అదే ఏరియాలో ఓ ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను సైతం దొంగిలించుకుపోయాడు. మృతురాలి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి, శంషాబాద్ విజయ్‌ని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి చోరీ చేసిన ఆభరణాలు, బైక్‌తోపాటు హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసును చేధించిన ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని సీపీ అభినందించారు.

శ్రీరామనవమిని ప్రశాంతంగా జరుపుకోవాలి

- నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి

వినాయక్‌నగర్/ రుద్రూర్, ఏప్రిల్ 4 : శ్రీరామనవమి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి సూచించారు. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు వివిధ ఆలయ కమిటీల సభ్యులు, సంఘాల ప్రతినిధులతో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రామనవమి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలు, ర్యాలీల్లో ఉత్సవ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై పలు సూచనలు చేశారు. రుద్రూర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో రుద్రూర్, వర్ని, కోటగిరి మండలాలకు చెందిన రామాలయాలు, హనుమాన్ ఆలయ కమిటీల సభ్యులతో శుక్రవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా శ్రీరామనవమి జరుపుకోవాలని సీఐ కృష్ణ సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- డీపీవో శ్రీనివాసరావు

సారంగాపూర్, ఏప్రిల్ 4 : ఎండలు తీవ్రమవుతున్నందున జిల్లాలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను డీపీవో శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని పాల్దా గ్రామాన్ని ఎంపీవో ఇక్బాల్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. గ్రామంలోని పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, కంపోస్టు షెడ్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తాగునీటి సరఫరా విషయంలో అశ్రద్ధ చేయకూడదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీపీవో వెంట పంచాయతీ కార్యదర్శి ధీరేందర్, కారోబార్ ఉన్నారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్యను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ టి.జోత్స్న శుక్రవారం కలిశారు. పూల మొక్కను అందజేసిన ఆమెను స్వాగతించి, అభినందించారు.
– వినాయక్‌నగర్, ఏప్రిల్ 4

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4 : నిజామాబాద్ నగరంలోని ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్బర్‌కాలనీ (కెనాల్‌కట్ట) ప్రాంతంలో సయ్యద్ పాషాపై కత్తితో దాడి చేసి, ఇంటిపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సౌత్ రూరల్ సీఐ సురేశ్ వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. ఈనెల 2న సయ్యద్ పాషాతో జరిగిన గొడవను మనస్సులో పెట్టుకున్న ఆరిఫ్‌ఖాన్‌తోపాటు అతడి భార్య రెహానాబేగం, కూతురు సుహానా బేగం, బావమర్ది షేక్ పర్వేజ్.. సయ్యద్ పాషా ఇంటిపై దాడిచేశారు. ఆరిఫ్‌ఖాన్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సయ్యద్ పాషా అల్లుడు షేక్ గౌస్‌ని కత్తితో పొడిచాడు. సయ్యద్ పాషా ఫిర్యాదు మేరకు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్ హత్యాయత్నం కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితులు ఆరిఫ్‌ఖాన్, సోహెల్ ఖాన్, షేక్ పర్వేజ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నలుగురు వ్యాపారులకు జైలు శిక్ష

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4 : నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళ దుకాణాలు తెరిచి ఉంచిన నలుగురు యజమానులకు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి వెల్లడించారు. గురువారం రాత్రి నిర్ణీత సమయం దాటినా దుకాణాలు తెరిచి ఉంచిన సయ్యద్ తాజ్‌ముల్లా, నదీముల్లా ఖాన్, అమీర్ ఖాన్, షేక్ షాబుద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెపారు. శుక్రవారం సెకండ్ క్లాస్ స్పెషల్ కోర్టులో ప్రవేశ పెట్టగా.. రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారని వెల్లడించారు.

ముగ్గురు మట్కారాయుళ్లకు..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4 : మట్కా ఆడుతూ పట్టుబడిన ముగ్గురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మిర్చి కాంపౌండ్ పరిధిలో మట్కా ఆడుతున్న షేక్ జునైద్, కాశీపతి, ఇబ్రహీంను పట్టుకొని, స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట శుక్రవారం ప్రవేశపెట్టగా వారికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

8న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 4 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తునర్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 8న దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న శ్రామికభవన్‌లో నాయకుడు వనమాల కృష్ణ మాట్లాడారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు నరేందర్, బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న, సుధాకర్, సాయన్న పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

సుద్దపల్లి శివాలయంలో శ్రమదానంలో పాల్గొన్న వలంటీర్లు

డిచ్‌పల్లి/సారంగపూర్, ఏప్రిల్ 4 : డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో టీయూకి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ –1, 4 వలంటీర్లు వేసవికాల ప్రత్యేక శిబిరంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడుతున్నారు. రెండోరోజు శుక్రవారం పోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రవంతి ఆధ్వర్యంలో జడ్పీహెచ్‌ఎస్, శివాలయ పరిసరాలను శుభ్రం చేశారు. రూరల్ మండలంలోని పాల్దా గ్రామంలో గిరిరాజ్ డిగ్రీ కళాశాల బాలుర విభాగం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వేసవి శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. వలంటీర్లు చేసిన శ్రమదానాన్ని డీపీవో శ్రీనివాసరావు పరిశీలించి మాట్లాడారు. కొండూర్ గ్రామంలోని వైకుంఠధామంలో కూడా శ్రమదానం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీవో ఇక్బాల్, ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం పోగ్రాం ఆఫీసర్లు నరేశ్, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు ధీరేందర్, ఉమా పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 4 : జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న శంకర్‌భవన్ పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ, ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా ధర్మారం గ్రామంలోని సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ హైస్కూల్, జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, పాఠశాలలోని అనేక రకాల కార్యక్రమాలను సుమారు 100 మంది విద్యార్థులు సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంపూర్ గ్రామంలోని విశ్వ ఆగ్రోటెక్ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలించారు. పశువుల దాణా తయారుచేసే విధానాన్ని విద్యార్థులు తెలుసుకున్నారు.

రాంపూర్‌లో కమ్యూనిటీ డే

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 : అటల్ టింకరింగ్ ల్యాబ్ –రాంపూర్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖగోళశాస్త్ర నిపుణురాలు రుక్మిణి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో అటల్ టింకరింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 7 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జడ్పీహెచ్‌ఎస్ మిట్టాపల్లి, సుద్దపల్లి పాఠశాలలకు సుమారు 52 మంది విద్యార్థులు కార్యక్రమంపై ప్రదర్శనలు చేశారు. కామారెడ్డి జిల్లా నుంచి మూడు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ఏర్గట్ల, ఏప్రిల్ 4: మండలంలోని తొర్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గురువారం తొర్తి గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని ఊరూవాడా తిరుగుతూ గొప్పగా ప్రసంగాలు చెప్పారని, కానీ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండానే కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయనను అవమానపర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అంబేద్కర్‌పై అభిమానం ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి దళిత బిడ్డకూ అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఈశ్వర్, మాజీ ఉప సర్పంచ్ తాహెర్, అజ్మత్, రాజ్ కుమార్, అంజద్, గణేశ్, పేపర్ భూమన్న, నాగర్జున్, దయానంద్, పోలింగ్, గంగాశన్న, నారాగౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమల వేస్తున్న నాయకులు

కొంగల రాంప్రసాద్‌కు డాక్టరేట్

సమాధానాలు చెబుతున్న కొంగల రాంప్రసాద్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 : టీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి కొంగల రాంప్రసాద్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రాజేశ్వరి పర్యవేక్షణలో 'టాలెంట్ అక్వేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ – ఎ సెలక్ట్ స్టడీ' అంశంపై పరిశోధన చేశారు. శుక్రవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా బెంగళూరు సిటీ యూనివర్సిటీ ఆచార్య పి.ముని నారాయణ హాజరై పరిశోధన సిద్ధాంతం గ్రంథంపై ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తారు. ఎక్స్‌టర్నల్ అడిగిన అన్ని ప్రశ్నలకు రాంప్రసాద్ ఉదాహరణలతో సమాధానాలు చెప్పడంతో ఎగ్జామినర్ సంతృప్తి వ్యక్తం చేసి, పీహెచ్‌డీ ప్రదానానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయులు, డీన్ ఆచార్య కె.అపర్ణ, డాక్టర్ వాణి, కిరణ్ రాథోడ్‌తోపాటు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో డీఎల్పీవో పర్యటన

చందూర్, ఏప్రిల్ 4: లక్ష్మాపూర్‌లో డీఎల్పీవో నాగరాజు శుక్రవారం పర్యటించారు. నర్సరీ, డంపింగ్ యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. జీపీ కార్యాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేసి, ఎల్‌ఆర్‌ఎస్ వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో నీలావతి, కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

'ఉద్యోగోన్నతి బాధ్యతను పెంచుతుంది'

సారంగాపూర్, ఏప్రిల్ 4 : ఉద్యోగోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయని కోర్సు డైరెక్టర్, జడ్పీహెచ్‌ఎస్ గూపన్‌పల్లి హెచ్‌ఎం శకుంతలా దేవి అన్నారు. గూపన్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన తెలుగు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్4: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి శుక్రవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఐదు మండలాల రెవెన్యూ, ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇండ్లు నిర్మిస్తే, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

భీమ్‌గల్/ఏర్గట్ల, ఏప్రిల్ 4: పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 5న నారాయణపేటలో నిర్వహించనున్న రాష్ట్ర ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం) రాష్ట్ర మహాసభ పోస్టర్లను శుక్రవారం బడాభీమ్‌గల్‌లో ఆసంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్మికులు సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అరవింద్, గ్రామపంచాయతీ వర్కర్స్ ప్రమీల, రాజగంగు, లక్ష్మీరాజన్న పాల్గొన్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా నాయకుడు జి.కిషన్ ఏర్గట్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఆవిష్కరించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Armoor Branch of Nizamabad Dist agreed to accord Loan to **Borrower:** Kotapati Narsimham S/o Kotapati Mala Kondaiah, Aged 66 Yrs, Occ:Business, R/o H.No.1-1-5/26/28/1, Mahalaxmi Colony, Armoor Proper and Mandal, Nizamabad (Dist) mortgage of the schedule referred property of **Kotapati Narsimham & Kotapati Parvathi** (Co-Borrowers/ Property holders). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

The existing R.C.C. Roofed Under construction Semi-finished Residential Flat No. 405 on Fourth Floor in Premier Residency (Gram Panchayath number not yet allotted) admeasuring R.C.C. Roofed Plinth area:34"-3"x 28-1.5" = 964.00 Sq.ft. or 107.11 Sq.Yds, including share in common areas and common facilities, corridor, balcony, common stair case etc. with undivided share of land measuring: 33.43 Square yards or 27.95 Sq.Mtrs in "Premier Residency" a residential apartment constructed in Open Place of Dismantled House bearing G.P. No. 1-21/7/2 in Survey Nos. 459/3 and 460 in G.P. File No.190/05 dated: 14-02-2007 and G.P. File No. 13/2007 dated: 06-03-2007, measuring total site area: 105-0" x 86-0" 1003.33 Sq.Yds, permission approved vide B.P.No.46/2009/HRO/HI, C.No.1275/2009/HRO/H1 situated at near M.J. Hospital, Perkit village of ARMOOR Mandal, Dist. Nizamabad, Gram Panchayath: PERKIT, Mandal Parishad: ARMOOR, District: NIZAMABAD, Registration District: NIZAMABAD and Registration Sub-District: ARMOOR, **Bounded as below: North**: Flat No.404 and Open to Sky, **South**: Lift, Open to Sky and Flat No.406, **East**: Open to Sky **West**: Common Corridor

LAND BOUNDARIES OF PREMIER RESIDENCY

"PREMIER RESIDENCY" residential apartment constructed in Open Place of Dismantled House bearing G.P. No.1-21/7/2 in Survey Nos. 459/3 and 460 in G.P. File No.190/05 Dtd.14.02.2007 and G.P.File No.13/2007 Dtd.06.03.2007, measuring total site area: 105-0" x 86-0"=1003.33 Sq.Yds, situated at near M.J. Hospital, Perkit village of ARMOOR Mandal, within the Gram Panchayath limits of Perkit, Mandal Parishad: ARMOOR, District: NIZAMABAD. **Bounded as below: North** : 33'-0" wide Road, **South:** 50'-0" wide Road, **East**: 33'-0" wide Road **West**: Varsha Apartment building

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

దూపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రెంజల్, ఏప్రిల్ 4: వాతావరణంలో వస్తున్న మార్పు కారణంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దూపల్లి, దండిగుట్ట, రెంజల్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 700 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటికే పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాసంగిలో ఐకేపీ సంఘాలకు 50 శాతం కొనుగోలు కేంద్రాలను కేటాయించామన్నారు. తూకంలో తేడాలు లేకుండా పారదర్శకత పాటించాలని ఆదేశించారు. రైస్ మిల్లులకు తరలించేందుకు హమాలీలు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దూపల్లి, దండిగుట్ట కొనుగోలు కేంద్రాల్లో రిజిష్టర్ నిర్వహణతీరు సరిగా లేక పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో ఆరవింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, ఈపీఎం సాయిలు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్, ఏసీఎం చిన్నయ్య తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 4 : జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు పాలకవర్గ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కోటగిరిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. రుద్రూర్ మండలం సిద్ధాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా ప్రారంభించారు. డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్, బర్ధిపూర్ గ్రామాల్లో కేంద్రాలను సొసైటీ చైర్మన్ తారాచంద్‌నాయక్, తహసీల్దార్ ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి సుధామాధురి ప్రారంభించారు. రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అనిరుధ్, గిర్దావర్ హరీశ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీధర్ ప్రారంభించారు. మోర్తాడ్, పాలెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపునర్సయ్య, వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న ప్రారంభించారు. భీమ్‌గల్ మండలంని పురాణీపేట్‌లో రైతు సేవా సహకార సంఘం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు దైడి సురేశ్ ప్రారంభించారు. భీమ్‌గల్ మండలం మెండోరాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీఎల్‌పీవో శివకృష్ణ ప్రారంభించారు. వేల్పూర్‌లో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎడపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లై, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఏపీఎం గంగారాంకు పలు సూచనలు చేశారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్4: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికలు సాధికారత–మహిళా చట్టాలు అనే అంశాలపై మహిళా న్యాయవాది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన

మాక్లూర్, ఏప్రిల్4: మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీ విగ్రహాన్ని కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ ప్రతిష్ఠించారు. 2003–04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం రాజేందర్ తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు రమణచారి, రామకృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు సాయికుమార్, సచిన్, శ్రీకర్, ప్రదీప్, రవి, సంతోష్, ప్రకాశ్, సాయిబాబ, చైతన్య, వీడీసీ, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

బోధన్, ఏప్రిల్ 4: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యాధికారి రాజేశ్వరి సూచించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో నిర్వహించిన సమావేశంలో ఆమె వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు పలు సూచనలు చేశారు. ప్రైవేట్‌కు వెళ్లే వారికి ప్రభుత్వ దవాఖానాల్లో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, దవాఖాన సూపరింటెండెంట్ రాహుల్, ఆర్ఎంవో రహీం, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి నిర్మల, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి రాజేశ్వరి

విద్యుత్ మరమ్మతులు రైతులు చేయొద్దు

ఫిర్యాదుల పరిష్కారవేదికలో మాట్లాడుతున్న అధికారులు

మోర్తాడ్, ఏప్రిల్ 4: వ్యవసాయ క్షేత్రాల వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులే మరమ్మతులు చేయవద్దని, లైన్‌మన్లకు తెలియజేయాలని విద్యుత్ అధికారులు సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రాజేశ్వర్, ఏడీఈ వినోద్, ఏఈ అన్నయ్య, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ, రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

50శాతం సబ్సిడీపై గొర్రె, మేకల పంపిణీ

మాక్లూర్, ఏప్రిల్4: 50శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి అన్నారు. శుక్రవారం బోర్గం(కె)లో గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షుడు బుర్రోల్ల అశోక్, మేడిద ప్రభాకర్, అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పాల ఉత్పత్తి, పాడి పశువుల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పశువైద్యాధికారి డాక్టర్ ఉమామాసాహెర్, పెంపకందారులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించాలి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 4: శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి శోభాయాత్రలను పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం బోధన్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో బోధన్ పట్టణ, రూరల్ సీఐలు వెంకట నారాయణ, విజయ్‌బాబు, ఎస్సైలు, పలు ఆలయాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బోధన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్

కాసుల విద్యాసాగర్

బోధన్, ఏప్రిల్ 4: బోధన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది కాసుల విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈ పదవికి కాసుల విద్యాసాగర్, సీహెచ్‌వీ హన్మంత్‌రావు పోటీపడగా, శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో విద్యాసాగర్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు గోపాల్‌రెడ్డి, నందకుమార్ ప్రకటించారు. విద్యాసాగర్‌ను పలువురు న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహారెడ్డి, అడ్లూర్ శ్రీనివాస్, కోటేశ్వరరావు, అర్జున్ రాండార్, శంకర్ పాల్గొన్నారు.

కారుతో బైకును ఢీకొట్టిన వ్యక్తికి జరిమానా

శక్కర్‌నగర్, ఏప్రిల్ 4:బోధన్ పట్టణంలోని జలాల్‌బుకారీ దర్గా వద్ద కారుతో బైక్‌ను ఢీకొట్టి, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయపడిన సంఘటనలో కారు డ్రైవర్ మహ్మద్ రఫీకి రూ.10వేల జరిమానా విధిస్తూ బోధన్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి పూజిత తీర్పు చెప్పారు. 2019 ఫిబ్రవరి 1న బోధన్ మండలంలోని కల్దుర్కికి చెందిన షేక్ హబీబ్ తన మోటార్ సైకిల్‌పై బోధన్‌కు వస్తున్నాడు. నంబర్‌ప్లేట్ లేని కారు వచ్చి ఢీకొట్టి నుంచి వెళ్లిపోయింది. హబీబ్ బోధన్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సలు చేయించుకుని, తనను కారుతో ఢీకొట్టిన వ్యక్తిని రెంజల్‌కు చెందిన మహ్మద్ రఫీగా గుర్తించి అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు మహ్మద్ రఫీని కోర్టులో హాజరు పర్చగా అతనికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

మోర్తాడ్, ఏప్రిల్ 4: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే ఐదు ఇండ్లకు మార్కింగ్ వేసినట్లు తెలిపారు. మిగతా వారు కూడా సోమవారం నాటికి మార్కింగ్ పూర్తిచేసుకోవాలని, లేదంటే ఇండ్ల నిర్మాణానికి వారు సుముఖంగా లేరని భావించాల్సి వస్తుందన్నారు. ఆర్థికంగా లేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ సెంటర్లు, హోటళ్లకు నోటీసులు

చికెన్‌సెంటర్ నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న జీపీ సిబ్బంది

మోర్తాడ్, ఏప్రిల్ 4: మోర్తాడ్‌లో చికెన్ సెంటర్లు, హోటళ్ల యజమానులకు శుక్రవారం జీపీ సిబ్బంది నోటీసులు ఇచ్చారు. చికెన్‌సెంటర్లు, హోటళ్ల వ్యర్థాలను గ్రామానికి దూరంగా పారవేయాలని, పరిశుభ్రత పాటించాలని నోటీసులో పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

- **చలివేంద్రాలు ప్రారంభం-** మాక్లూర్/ ముప్కాల్, ఏప్రిల్ 4: నందిపేట్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎర్రం సిలిండర్ లింగం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ శుక్రవారం ప్రారంభించారు. ముప్కాల్ జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రన్ని స్పెషల్ ఆఫీసర్ ప్రవంతి ప్రారంభించారు. ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో గౌస్ మోహినొద్దీన్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ద రమేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ-** వేల్పూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను శుక్రవారం ఎంపీవో సాయిలు తనిఖీ చేశారు. ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాలను పరిశీలించారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.
- **తడి, పొడి చెత్తపై అవగాహన -** ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్4: పట్టణంలోని 27వ వార్డులో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ మహిళలకు శుక్రవారం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను మున్సిపల్ వాహనానికి అందించాలని, బయట వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.
- **రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం-** బాల్కొండ, ఏప్రిల్ 4: ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు అలీమ్‌ను శుక్రవారం పలువురు సన్మానించారు. ఎంఈవో ఎంఈవో రాజేశ్వర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **సామాజిక నైపుణ్యాలతో ముందుకు సాగాలి-** నవీపేట, ఏప్రిల్ 4: భవిష్యత్తులో విద్యార్థులు సామాజిక నైపుణ్యాన్ని వృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని జన్నేపల్లి సీనియర్ సెకండరీ సీబీఎస్ఈ ఎస్ఎస్ఆర్ స్కూల్‌లో పట్టభద్రుల రోజు (గ్రాడ్యుయేషన్ డే) నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడారు.
- **ఇద్దరికి జైలు శిక్ష-** బోధన్ రూరల్, ఏప్రిల్ 4: బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు వ్యక్తులు రోజూ మద్యం మత్తులో 100కు కాల్స్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయడంతో వారిపై బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. వారికి బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్పసాయి రెండు రోజులు జైలు శిక్ష విధించారు.
- **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి..-** ముప్కాల్, ఏప్రిల్ 4: మద్యం తాగి పోలీసులకు పట్టుబడిన ముప్కాల్‌కు చెందిన అనికేష వెంకటేశ్, నల్లూర్‌కు చెందిన వయ్యా నిఖిల్‌కు శుక్రవారం ఆర్మూర్ కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.
- **టీస్టాల్ యజమానికి..-** శక్కర్‌నగర్, ఏప్రిల్ 4: బోధన్ పట్టణంలోని గోశాల రోడ్డులో నిబంధనలు అతిక్రమంచి రాత్రి వరకు టీస్టాల్ కొనసాగిస్తున్న యజమాని షేక్ ఖాజాకు ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ బోధన్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పు చెప్పారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. హోటళ్లు, దాబాలు, దుకాణాలు రాత్రి 10.30 తరువాత తెరిచి ఉంటే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.